నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
హైదరాబాద్, శుక్రవారం 23 మే 2025 | RANGAREDDY

## రైతన్నకు నష్టం..

కొందుర్గు : అకాల వర్షాలతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో కురుస్తున్న వర్షాలకు చేనులోనే తడిసి మొలకెత్తే పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని గ్రామాల్లో పంటలు కోసి కల్లాల్లో పెడితే కుండపోత వర్షానికి ధాన్యం కొట్టుకుపోయే పరిస్థితి నెలకొంది. ధాన్యం తడవకుండా ప్లాస్టిక్ కవర్లతో కప్పినా ఫలితం ఉండడం లేదు. మండలంలో ఆరబెట్టిన మొక్కజొన్న తడిచిపోగా అన్నదాతలు మళ్లీ ఆరబెట్టారు. అకాల వర్షంవర్షం అన్నదాతకు నష్టాల్ని మిగుల్చుతున్నది.


కొందుర్గు : అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న అన్నదాత


వర్షానికి మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

# తడిసిన ధాన్యం.. రైతన్న దైన్యం

## సక్రమంగా సాగని కొనుగోళ్లు

- కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే తేమ శాతం ఎక్కువగా ఉందని తూకం వేయని అధికారులు
- 20 రోజులుగా ధాన్యం రాశుల వద్దే నిరీక్షణ
- లబోదిబోమంటున్న అన్నదాతలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతకు ఆగచాట్లు తప్పడంలేదు. మంచాల మండల కేంద్రంలో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి అన్నదాత తీసుకొచ్చిన ధాన్యం తూకం వేయకపోవడంతో ధాన్యం రాశుల వద్దే గత 20 రోజులుగా నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొన్నదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కేంద్రానికి మండలంలోని చిత్తాపూర్, తాళ్లపల్లిగూడ, తిప్పాయిగూడ, జాపాల, మంచాల, లింగంపల్లి తదితర గ్రా మాల నుంచి రైతులు తమ ధాన్యాన్ని తీసుకొచ్చి.. కల్లాల్లో గత 20 రోజులుగా ఆరబెట్టినా ధాన్యాన్ని కొనడం లేదని.. ఈ కేంద్రంలో సరైన వసతులు లేకపోవడంతో.. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వడ్లు తడిసి ముద్ద అయి.. మొలకలు వచ్చాయని వాపోతున్నారు. అధికారులు సకాలంలో కొనుగోలు చేసి ఉంటే ధాన్యం వర్షానికి తడిసేది కాదని..ప్రభుత్వ నిర్లక్ష్యంతో తమకు ఇబ్బందులు తప్పడంలేదని లబోదిబోమంటున్నారు. తడిసిన వడ్లను ఆరబెట్టడమే పనిగా మారిందని మండిపడుతున్నారు.

–మంచాల, మే 22

## వరద నీటిలో కొట్టుకుపోయిన మొక్కజొన్నలు

### అకాల వర్షం.. అపార నష్టం

ధారూరు : మండలంలో బుధవారం రాత్రి కురిసిన వానకు నాగుసాన్‌పల్లి గేట్ వద్ద రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్నలు రోడ్డుపై పారిన నీటిలో కొట్టుకుపోయాయి. నాగారం, మోమిన్‌కలాన్, ధారూరు, మైలారం, గురుదోట్ల, దోర్నాల్, తరిగోపుల, రాజాపూర్, గట్టేపల్లి, కేరెళ్లి, చింతకుంట, తదితర గ్రామాల్లో మోస్తరు వాన కురిసింది. నాగారం, గురుదోట్ల, మోమిన్‌కలాన్ గ్రామాల్లో ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో కొనుగోలు కేంద్రం వద్ద ఆరబెట్టిన ధాన్యం కొంత మేరకు తడిచిపోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షంతో తీవ్రంగా నష్టపోతున్నామని పలువురు పేర్కొంటున్నారు.


వరద నీటిలో కొట్టుకుపోతున్న ధారూరులో రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్నలు


మంచాల కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



### 20 రోజులుగా.. ధాన్యం రాశుల వద్దే..

పండించిన పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రానికి 20 రోజుల కిందట తీసుకొచ్చా. తేమ శాతం ఎక్కువగా ఉన్నదని తూకం చేయకపోవడంతో .. కల్లాల్లోనే ఆరబెడుతున్నా. ప్రస్తుతం తేమ శాతం తగ్గింది. అయినా కొనడంలేదు. దీంతో గత 20 రోజులుగా ప్రతిరోజూ ధాన్యం కుప్పల వద్ద కాపలాగా ఉంటున్నా.

**-అచ్చన్న అంజయ్య(తాళ్లపల్లి గూడ రైతు)**

## కాలుష్యకారక పరిశ్రమలు

# వద్దే వద్దు

- పంట పొలాల మధ్య వాటిని ఏర్పాటు చేయొద్దు
- సింథటిక్స్ కంపెనీ నుంచి ఉదయం, రాత్రి సమయాల్లో పొగ వస్తున్నది..
- దానితో రోగాలబారిన పడుతున్నాం..
- పంటలూ పడడం లేదు..
- స్పష్టంచేసిన మీర్జాపూర్ రైతులు

### కొత్త వాటికి అనుమతులిస్తే ఊరుకోం..


ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన స్థలం వద్ద గుమిగూడి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పూడూరు, మే 22 : కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలు పొలాల మధ్య ఏర్పాటు చేయొద్దని రైతులు ఆందోళన చేశారు. గురువారం మండలంలోని మీర్జాపూర్‌లోని సర్వేనంబర్ 17ఈ/17ఏలోని భూమిలో ఒక సింథటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్,(ప్లైవుడ్ తయారీ) కంపెనీ ఉన్నది. ఆ పరిశ్రమ పక్కనే ఆ సర్వేనంబర్‌లోని స్థలంలోనే మరో సింథటిక్స్ పరిశ్రమ ఏర్పాటు కోసం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ గురువారం నిర్వహిస్తామని అధికారులు ముందుగానే ప్రకటించారు. ఈ కార్యక్రమానికి వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ రాకపోవడంతో వాయిదా పడింది. అప్పటికే అధిక సంఖ్యలో తరలివచ్చిన రైతులు ప్రస్తుతం కొనసాగుతున్న సింథటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్,(ప్లైవుడ్ తయారీ) కంపెనీ కాలుష్యంతో చుట్టు పక్కల భూముల్లో పంటలు పండడం లేదని, మనుషులతోపాటు పశువులు కూడా రోగాలబారిన పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పూలు, వరి, మొక్కజొన్న పత్తి తదితర పంటలను సాగు చేస్తే అధిక దిగుబడులు వచ్చేవని.. సింథటిక్స్ కంపెనీ ఏర్పాటుతో అధికంగా కాలుష్యం, పొగ రావడంతో పంటల దిగుబడి రావడం లేదని రైతులు విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య కారక పరిశ్రమలు పొలాల మధ్య వద్దే.. వద్దంటూ అన్నదాతలు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. ఈ విషయాన్ని అధికారులకు తెలిపేందుకు ఇక్కడికి వచ్చామని.. ఉన్నతాధికారులెవ్వరూ ప్రజాభిప్రాయ సేకరణకు హాజరు కాలేదన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ భరత్‌ను అడుగగా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఇతర పనుల వల్ల ఈ కార్యక్రమానికి హాజరు కాకపోవడంతో వాయిదా వేసినట్లు చెప్పారు.

### కాలుష్యంతో ప్రాణాలకే ముప్పు..



కంపెనీ నుంచి వచ్చే కాలుష్యంతో రోగాలబారిన పడుతున్నాం. ఉదయం, రాత్రి సమయాల్లో కంపెనీ నుంచి పొగ వస్తున్నది. కిలోమీటర్ వరకు నల్లటి పొగమబ్బులు ఏర్పడుతున్నాయి. ఈ ప్రాంతంలో కంపెనీతోపాటు మైనింగ్ తవ్వకాలతో నిరంతరం దుమ్ము వస్తున్నది. కాలుష్య నివారణ, పర్యావరణ శాఖల అధికారులు ఇప్పటివరకూ పరిశీలించిన దాఖలాల్లేవు. కొందరు నాయకుల అండదండలతో నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కాలుష్య కారక పరిశ్రమను ఇక్కడి నుంచి తరలించేందుకు నాయకులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.

**-శేఖర్ మీర్జాపూర్ గ్రామం, పూడూరు మండలం**

### గతంలో పూల తోటను సాగు చేసేవాడ్ని..



గతంలో నాకున్న రెండెకరాల పొలంలో పూల తోట, వరిని సాగు చేసేది. గత రెండేండ్ల నుంచి పూలతోటను సాగు చేయడం లేదు. కంపెనీ నుంచి వచ్చే పొగతో రంగు మారి నల్లబడి పాడయ్యాయి. వరి పంట కూడా కాలుష్యంతో సరైన దిగుబడి రావడంలేదు. పొలాల మధ్య నుంచి భారీ వాహనాలు వెళ్తుండడంతో దుమ్మూధూళి పంటలపై పడుతున్నది. పొలాల మధ్య ఉన్న కంపెనీని ఇతర ప్రాంతాలకు తరలించాలి. లేకుంటే పొలాలన్నీ బీడుభూములుగా మారుతాయి.

**-పెంటయ్య రైతు మీర్జాపూర్ గ్రామం, పూడూరు**



గత బీఆర్‌ఎస్ హయాంలో అన్నదాతలు వ్యవసాయాన్ని పండుగలా చేసుకున్నారు. సీజన్‌కు ముందే రైతుబంధు పెట్టుబడి సాయం బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో ఎరువులు, విత్తనాలను సకాలంలో సమకూర్చుకునేది. కానీ, 17 నెలల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతన్నను అన్ని విధాలా ఇబ్బందులకు గురి చేస్తున్నది. రైతుబంధు పేరుతో ఉన్న పథకాన్ని రైతుభరోసాగా మార్చింది. ఓ వైపు రైతుభరోసా పెట్టుబడి సాయం అర్హులందరికీ అందకపోగా, బ్యాంకర్లు పంట రుణాల మంజూరులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో.. తప్పనిసరి పరిస్థితుల్లో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలవుతున్నాడు అన్నదాత..

### రైతన్నకు అరకొర పంట రుణాలే మంజూరు

- 2024-25లో రూ.3,547 కోట్లకుగాను రూ.2014 కోట్ల రుణాలే
- కేవలం 55% రుణాలే మంజూరు చేసిన బ్యాంకర్లు
- నాలుగు ఎకరాల్లోపే రైతులకు అందిన రైతు భరోసా సాయం

# రుణం లేదు.. సాయమూ అందలేదు

వికారాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో రైతులు అవస్థలు పడుతున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో అప్పుల కోసం చూడని రైతన్న పంటల సాగుకోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొన్నది. కేసీఆర్ హయాంలో సీజన్ ప్రారంభానికి ముందే విత్తనాలు, ఎరువులను కొనేందుకు రైతుబంధు సాయం అందగా.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 17 నెలలు దాటుతున్నా అర్హులందరికీ రైతు భరోసా పెట్టుబడి సాయం పంపిణీ కాకపోవడంతో జిల్లాలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన అనంతరం రైతును రాజుగా చేయాలన్న సంకల్పంతో గత కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు కింద పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయడంతో పంట రుణాలు తీసుకునే రైతుల సంఖ్య సగానికిపైగా తగ్గిపోయింది.

కాగా, రేవంత్ ప్రభుత్వం పవర్‌లోకి వచ్చిన నాటి నుంచి ఓ వైపు పెట్టుబడి సాయం అందకపోగా, బ్యాంకర్లు పంట రుణాలనూ మంజూరు చేయకపోవడంతో అన్నదాత అధిక వడ్డీకి వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొన్నది.

### కొందరికే రైతు భరోసా..

పదేండ్ల కేసీఆర్ పాలనలో సీజన్‌కు ముందే పెట్టుబడి సాయాన్ని అందించి అప్పుల్లో కూరుకుపోయిన రైతులను ఆర్థికంగా ఆదుకోగా.. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో విడతల వారీగా పెట్టుబడి సాయాన్ని అందించి ఆగం చేసింది. మొదట మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, అందులోనూ తక్కువ జనాభా ఉన్న ఒక్క గ్రామాన్ని ఎంపిక చేసి రైతు భరోసా సాయాన్ని అందజేసింది. తదనంతరం ఒక్క ఎకరం, రెండెకరాలు ఇప్పటివరకు నాలుగు ఎకరాల వరకు మాత్రమే రైతుభరోసా కింద పెట్టుబడి సాయాన్ని అన్నదాత బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. కాగా, జిల్లాలో అర్హులుగా గుర్తించిన రైతుల్లో ఇంకా దాదాపుగా 86,872 మందికి పెట్టుబడి సాయం అందాల్సి ఉన్నది. రైతుభరోసా కోసం అన్నదాతలు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరోవైపు వానకాలం సమీపిస్తున్నా ఇంకా యాసంగి రైతుభరోసా అందకపోవడంతో తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. కాగా జిల్లాలోని 3,12,872 మంది రైతులకు రూ.385.46 కోట్ల రైతుభరోసా సాయాన్ని అందించాలని అధికారులు నిర్ణయించగా, ఇప్పటివరకు నాలుగెకరాల్లోపు 2,26,000 మంది రైతులకు రూ. 212.52 కోట్ల సాయాన్ని మాత్రమే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. మిగతా రైతులకు సాయం ఎప్పుడు జమ అవుతుందనేది అధికారులు కూడా స్పష్టత ఇవ్వడంలేదు. రైతుభరోసా సాయం అర్హులందరికీ పంపిణీ చేయకపోవడంతో అన్నదాతలు ప్రభుత్వ తీరుపై భగ్గుమంటున్నారు.

### రుణాల మంజూరు 55% మేర..

2024–25 ఆర్థిక సంవత్సరంలో రైతులకు బ్యాంకర్లు అరకొర రుణాలనే మంజూరు చేశారు. ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యంలో 55% మేర రుణాలనే మంజూరు చేశారు. ఈ ఏడాది వానకాలం, యాసంగిలకు రూ. 3,547 కోట్ల రుణాలివ్వాలని టార్గెట్‌గా పెట్టుకుని రూ. 2,014 కోట్ల రుణాలనే రైతులకు ఇచ్చారు. అర్హుల్లో కొంతమందికే రుణమాఫీ చేసి రైతులకు కాంగ్రెస్ పార్టీ నష్టం చేస్తే, రుణమాఫీ అయిన రైతుల పంట రుణాలను రెన్యువల్ చేయడంలో బ్యాంకర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అదేవిధంగా, యాసంగి దాటినా రైతులకు పంట రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకర్లు జాప్యం చేస్తుండడం గమనార్హం. ప్రస్తుత పాలకులు బ్యాంకర్లతో ఎలాంటి సమావేశాలు నిర్వహించకపోవడంతోపాటు వారిపై అజమాయిషీ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. బ్యాంకర్లు రుణాలు ఇవ్వకపోవడంతో అన్నదాతలు గత్యంతరం లేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.